సాక్షి
నారాయణపేట
బుధవారం । 12 । మార్చి । 2025



బ్రహ్మోత్సవాలు ప్రారంభం

రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు గోపూజతో ప్రారంభమయ్యాయి.

వివరాలు 8లో ▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-31 (బుధవారం సాయంత్రం)

సహర్ 5-03 (గురువారం తెల్లవారుజామున)

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 35.6 /17.2

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. రాత్రి చల్లని గాలులు వీస్తాయి.

రోడ్లపైనే మార్కెట్లు..!

మక్తల్, మద్దూరులో రైతుబజార్లు లేక రోడ్లపైనే కూరగాయల విక్రయాలు



పేట కూరగాయల మార్కెట్‌కు, రైతు బజార్‌కు వెళ్లే దారిలో ఇరువైపులా చిరువ్యాపారుల విక్రయాలు



జిల్లా కేంద్రంలో ఖాళీగా దర్శనమిస్తున్న రైతుబజార్ షెడ్

- పేట, కోస్గిలో మార్కెట్లు ఉన్నా.. ప్రయోజనం సున్నా
- వ్యాపారులు పోటీపడి రోడ్లపైకి వచ్చి కూరగాయలు, పండ్ల విక్రయాలు
- వినియోగదారులు, వాహనదారుల ఇక్కట్లు

సాక్షి ఫోకస్

నారాయణపేట: జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో రోడ్లపైనే కూరగాయల విక్రయాలు సాగుతున్నాయి. నారాయణపేట, కోస్గిలో రైతుబజార్లు, షెడ్లు నిర్మించినా కూడా కూరగాయల వ్యాపారం మళ్లీ వీధికెక్కింది. నాలుగు మున్సిపాలిటీల్లో రోడ్లనే మార్కెట్లు చేసి వ్యాపారాలు నిర్వహిస్తూ అటు వినియోగదారులకు, ఇటు వాహనదారులకు ఇబ్బందులకు గురిచేస్తున్నారు. కూరగాయలు, ఆకు కూరలు, పండ్లు ఎంత తాజాగా ఉన్నా.. రోడ్లపైనే దుమ్మూ దూళి మధ్య విక్రయించడంతో ఎక్కడ అనారోగ్యం బారిన పడతామోనని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

రూ.లక్షలు వెచ్చించి నిర్మించినా..

జిల్లా కేంద్రమైన నారాయణపేట నడిబొడ్డున కూరగాయల మార్కెట్ ఉంది. కూరగాయల మార్కెట్ దుకాణాల సముదాయం ఉండగా 2018లో గత ప్రభుత్వ హయాంలో రైతు బజార్‌ను రూ.68 లక్షలతో 16 దుకాణాలు, షెడ్లను నిర్మించారు. రైతులు పండించిన కూరగాయలను స్వయంగా విక్రయించుకుని లబ్ధి పొందేందుకు రైతు బజార్‌ను ఏర్పాటు చేయడంతో ఈ ప్రాంతంలో రైతులు తెల్లవారు జామున 4గంటల నుంచి 7 వరకు విక్రయించుకొని వెళ్తుంటారు. ఆ తర్వాత రైతు బజార్ వెలవెలబోతుంది. కూరగాయల చిరు వ్యాపారులు ఆయా షెడ్లలో కూరగాయలను విక్రయించుకునేందుకు ఆసక్తి చూపకపోవడంతో పోటీపడి ఒకరి తర్వాత ఒకరు రోడ్లపైకి వస్తున్నారు. దీంతో కూరగాయలు కొనుగోలు చేసేందుకు వచ్చే జనం బేజారు అవుతున్నారు. అలాగే, కూరగాయల మార్కెట్‌కు వచ్చే వ్యాపారులతో పాటు ప్రజల దాహార్తిని తీర్చేందుకు రూ.లక్షలు వెచ్చించి వాటర్‌ప్లాంట్ ఏర్పాటుచేశారు. కానీ, నిర్వహణ సరిగా లేకపోవడంతో నిరుపయోగంగా మారింది. అసలే వేసవికాలం, ఎక్కడెక్కడి నుంచే రైతులు కూరగాయలు విక్రయించేందుకు, ప్రజలు కొనుగోలు చేస్తుందుకు వస్తుంటారు. మార్కెట్ అధికారులు స్పందించి మరమ్మతు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని వ్యాపారులు కోరుతున్నారు.

ఈ ఫొటోలో కనిపిస్తున్నది నారాయణపేటలో రూ.38 లక్షలతో నిర్మించిన రైతు బజార్ దుకాణ సముదాయం. అయితే, వ్యాపారులు కూరగాయలను తమ దుకాణాల్లో ఉంచి విక్రయించకుండా రోడ్డుపైకి తీసుకొస్తున్నారు. రైతు బజార్‌లోకి వెళ్లేందుకు ఉన్న రహదారిలో అటు, ఇటు చిరు వ్యాపారులు కూర్చోవడంతో కూరగాయలు కొనేందుకు, వెళ్లి వచ్చే వారికి ఇబ్బందులు తప్పడం లేదు. చిరు వ్యాపారులందరినీ రోడ్లపై కాకుండా రైతు బజార్‌లో విక్రయించే విధంగా మార్కెట్, మున్సిపల్ అధికారులు చొరవ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఆటోలకు అడ్డాగా మారిన షెడ్లు

జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ నుంచి జిల్లా ఆస్పత్రికు వెళ్లే ప్రధాన రహదారి గుండా వీధి వ్యాపారులు రోడ్లపై కూర్చొని కూరగాయలు, టెంకాయలు, అల్లం ఎల్లిపాయలు, ఉల్లిగడ్డలు ఇతర చిరువ్యాపారాలు చేసుకుంటుండడంతో అంబులెన్స్‌లు, ఇతర అత్యవసర చికిత్సల నిమిత్తం వెళ్లే వాహనాలకు ఇబ్బందులు ఎదురయ్యేవి. దీంతో గత ప్రభుత్వం 2023 అక్టోబర్‌లో రూ.15 లక్షల వ్యయంతో జిల్లా ఆస్పత్రి ముందు భాగంలోని ఖాళీ స్థలంలో రోడ్డుపై షెడ్లను నిర్మించి ఇచ్చింది. అయితే, ఆ షెడ్లలో వీధి వ్యాపారులు తమ వ్యాపారాలను కొనసాగించుకోకుండా గోదాంలా వాడుకుంటున్నారు. ఎందుకని వారిని ప్రశ్నిస్తే.. తమ దుకాణాల ముందు ఆటోలు నిలుపుతూ వారి అడ్డాగా మార్చేశారని, ఎలాంటి గిరాకీ రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే వీధి వ్యాపారుల ముందు ఉన్న ఆటోవాలాలకు ఓ స్టాండ్‌ను ఏర్పాటుచేయించాలని వ్యాపారులు కోరుతున్నారు. దీనికితోడు ఈ రోడ్డు మార్గంలో తరచూ ట్రాఫిక్‌జామ్ ఏర్పడుతుండడంతో అత్యవసర సేవల కోసం వెళ్లే రోగుల పాలిట ప్రాణసంకటంగా మారుతున్నాయి. పాత బస్టాండ్ దగ్గర ఉన్న చిన్న పిల్లల ఆస్పత్రి దగ్గర సైతం ట్రాఫిక్‌జామ్ అవుతున్నా పట్టించుకున్న పాపాన పోవడం లేదు.

షెడ్ నిర్మించాలి



20 ఏళ్లుగా నారాయణపేట రైతుబజార్‌లో ఏర్పాటుచేసిన షెడ్ పక్కనే కూరగాయల వ్యాపారం నిర్వహిస్తున్నా. రైతుబజార్, కూరగాయల మార్కెట్ దుకాణాలను కలుపుకొని పెద్ద కవర్ షెడ్ నిర్మిస్తే బాగుంటుంది. వ్యాపారులు అందరూ షెడ్ చెట్టూ విక్రయాలు చేసేందుకు వీలుంటుంది. లేదంటే ఇలాగే పోటీపడుతూ రోడ్డుపైకి వచ్చి కూరగాయలు విక్రయిస్తుంటారు.

– లక్ష్మి, కూరగాయల వ్యాపారి, నారాయణపేట

మందుబాబులకు అడ్డాగా కోస్గి మార్కెట్



కోస్గి కూరగాయల మార్కెట్‌లో కట్టలపై నిద్రించిన మందుబాబులు.. కింద ఖాళీ మద్యం సీసాలు

కోస్గి పట్టణ నడిబొడ్డున గత ప్రభుత్వ హయాంలో రూ.కోటి నిధులతో కూరగాయల మార్కెట్ నిర్మించారు. కానీ, వ్యాపారులు ఆ షెడ్‌లో వ్యాపారాలు నిర్వహించకుండా ప్రధాన రహదారిపై కూరగాయలను విక్రయిస్తున్నారు. దీనికితోడు చీకటి పడిదంటే చాలు తాగుబోతులకు అడ్డాగా షెడ్లు మారుతున్నాయి. ఇటు అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో ప్రధాన రహదారిపై వ్యాపారాలు కొనసాగుతుండడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. సీఎం ఇలాఖాలో ఇలా ఉంటే మిగతా ప్రాంతాల్లో పరిస్థితి ఎలా ఉంటుందో నంటూ జనం వాపోతున్నారు. వెంటనే ఉన్నతాధికారులు చొరవ తీసుకొని కూరగాయల మార్కెట్‌ను వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.



కోస్గిలోని కూరగాయల మార్కెట్ ఎదుట ప్రధాన రహదారిపై కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారులు

మద్దూరులో ఇరుకు రోడ్లపై అవస్థలు



మద్దూర్‌లో రోడ్డుపైనే కూరగాయల విక్రయాలు

మద్దూరులో కూరగాయల విక్రయాలు రోడ్లపైనే నిర్వహిస్తున్నారు. ఇక్కడ రైతుబజార్, షెడ్లు కానీ నిర్మించలేదు. రోడ్లపై విక్రయాలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వ్యాపారులను రోడ్లపై నుంచి తొలగించడానికి పోలీసులు ప్రయత్నించినా లాభం లేకుండా పోతుంది. ఇరుకుగా ఉండే పాత బస్టాండ్ చౌరస్తాలో రోడ్లపైనే కూరగాయలు ఇతర ఇతర వస్తువుల విక్రయాలు చేస్తున్నారు. ప్రతి గురువారం జరిగే సంత నాడు వాహనదారులు, ప్రజలు చుక్కలు చూడాల్సిందే. మద్దూరు మున్సిపాలిటీ ఏర్పడిన తర్వాత వెంటనే వీధి వ్యాపారస్తులకు, కూరగాయల వ్యాపారస్తులకు రైతు బజారును ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

న్యూస్‌రీల్

రేపు టెన్నికాయిట్ క్రీడాకారుల ఎంపిక

మక్తల్: జిల్లా టెన్నికాయిట్ అసోషియేషన్ ఆధ్వర్యంలో మక్తల్‌లో 13వ తేదీన జిల్లాస్థాయి టెన్నికాయిట్ క్రీడాకారుల ఎంపిక నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.దీప తెలిపారు. పట్టణంలో సాయిజ్యోతి ఉన్నత పాఠశాల ఆవరణలో మహిళలు, పురుషులకు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఆధార్‌కార్డు, బోనోఫైడ్, మూడు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో హాజరుకావాలని, ప్రతిభ కనబర్చిన వారిని ఈ నెల 15, 16 తేదీల్లో హన్మకొండలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు.

జొన్నలు క్వింటాల్ రూ.4,565

నారాయణపేట: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం జొన్నలు క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.4,565, కనిష్ఠంగా రూ.4,320 ధర పలికాయి. అలాగే, శనగలు గరిష్ఠం రూ.5,720, కనిష్ఠం రూ.5,659, పెసర గరిష్ఠం రూ.6,818, కనిష్ఠం రూ.6,606, అలసందలు గరిష్ఠం, కనిష్ఠం రూ.6,933, ఎర్ర కందులు గరిష్ఠం రూ.7,411, కనిష్ఠం రూ.4,350, తెల్ల కందులు గరిష్ఠంగా రూ.7,663, కనిష్ఠంగా రూ.6,759 ధరలు పలికాయి.

పీయూలో 27, 28 తేదీల్లో వర్క్‌షాప్



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో ఈ నెల 27, 28 తేదీల్లో ఎంబీఏ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో రీసెర్చ్ మెథడాలజీ, ప్రాజెక్టుపై రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు పీయూ వీసీ శ్రీనివాస్ పేర్కొన్నారు. అందుకు సంబంధించిన బ్రోచర్‌ను ఆయన మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఎంబీఏ చివరి సంవత్సరం విద్యార్థులకు ఈ వర్క్‌షాప్ ఎంతో ఉపయోగకరం అని, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ చెన్నప్ప, ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి, కన్వీనర్ అర్జున్‌కుమార్, కో కన్వీనర్ నాగసుధ, జావిద్‌ఖాన్, అరుంధతి, గాలెన్న తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ల ఖరారు తర్వాతే ఫలితాలివ్వాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించి, వాటిని ఖరారు చేసే వరకు గ్రూప్–1, 2, 3 ఫలితాలను ప్రకటించవద్దని ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కార్తీక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పీయూ మెయిన్ గేట్ వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వంలో ఉన్న కొంత మంది స్వార్థపరుల ఒత్తిడి మేరకు మాదిగ విద్యార్థుల భవిష్యత్‌ను దెబ్బతీయాలన్న కుట్రతో ముందస్తుగా గ్రూప్స్ ఫలితాలను విడుదల చేస్తున్నారని ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణలో ఏబీసీడీ వర్గీకరణ అనంతరం మాత్రమే ఫలితాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో బిల్లు పెడతామని ప్రభుత్వం చెబుతూనే ఫలితాల విడుదలకు కసరత్తు చేయడం బాధాకరమని, రిజర్వేషన్‌ల బిల్లు పెట్టి వర్గీకరణ చేసే వరకు నిరసన చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ అధ్యక్షుడు టైగర్ అంజయ్య, వీరస్వామి, జేఏసీ చైర్మన్ రాము, దాసు, శ్రీను, రవితేజ, రాము, నాగేందర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

యువతతోనే దేశ ప్రగతి

నాగర్‌కర్నూల్ క్రైం: యువతతోనే దేశప్రగతి ముడిపడి ఉందని, దేశ అభివృద్ధిలో యువత కీలకం అని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్ అన్నారు. కేంద్ర యువజన క్రీడా సర్వీసులు, మై భారత్, నెహ్రూ యువకేంద్ర సహకారంతో స్వామివివేకానంద సేవా బృందం ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మంగళవారం యువ ఉత్సవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ వికసిత్ భారత్‌లో యువత పాత్ర ముఖ్యమైనదని, చదువుతోపాటు సామాజిక స్పృహ కలిగి ఉండాలన్నారు. ప్రస్తుత సమాజంలో విద్యార్థులపై సోషల్‌మీడియా ప్రభావం ఎక్కువగా ఉందని, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. ఈ నెలలో జరగనున్న జాతీయ యూత్ పార్లమెంట్ వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం యువ ఉత్సవంలో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో ప్రతిభచాటిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి, స్వామివివేకానంద సేవా బృందం అధ్యక్షుడు శివకుమార్, జిల్లా యువజన అధికారి కోటానాయక్, కల్యాణ్‌నాయక్, సుధాకర్, లక్ష్మీనర్సింహ, అజయ్ పాల్గొన్నారు.

వ్యవసాయ అనుబంధ రంగాలకు రుణాలివ్వండి



రైతుతో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట: ప్రాధాన్యత రంగాలైన అగ్రికల్చర్, ఎంఎస్‌ఎంఈలకు అధిక మొత్తంలో రుణాలు మంజూరు చేసి జిల్లా అభివృద్ధికి తోడ్పడాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో డీసీసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. బ్యాంకర్లు వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి సకాలంలో రుణాలు మంజూరు చేయాలన్నారు. సమావేశంలో కన్వీనర్, లీడ్ బ్యాంకు మేనేజర్ వార్షిక ప్రణాళిక 2024–25 డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసానికి రూ.1984.54 కోట్లతో త్రైమాసిక వృద్ధి అని, వార్షిక ప్రణాళికలో 60.62 శాతం అలాగే ఎస్‌ఎంఈ సెగ్మెంట్‌కు సంబంధించి రూ.123.06 కోట్లతో 48.80 శాతం ప్రగతి అని తెలిపారు. ప్రాధాన్యత రంగానికి 1678.14 కోట్ల రుణాలు మంజూరు చేయడం జరిగిందని వివరించారు. ఆయా బ్యాంకుల ఏజీఎంలు శ్రీహరి, ప్రకాష్, శ్రావ్య, షణ్ముఖచారి, అనిల్‌కుమార్, జిల్లా అధికారులు పలు సమస్యలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. అనంతరం నాబార్డు వారిచే పొటెన్షియల్ లింక్ ప్లాన్ 2025–26 గాను రూ.3,833.47 కోట్ల రుణ లక్ష్యంతో రూపొందించిన పుస్తకాన్ని కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. ఈ మొత్తం 2024–25 సంవత్సరం కంటే 25.23 శాతం అధికం కాగా, వ్యవసాయ రంగానికి రూ.3470.93 కోట్లు, ఎంఎస్ ఎంఈ రంగానికి రూ.310.30 కోట్ల లక్ష్యాన్ని నిర్ధారించారు. సమావేశంలో స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గ్యంగ్వార్, ట్రైని కలెక్టర్ గరిమా నరుల పాల్గొన్నారు.

వరి పంట పరిశీలన

ధన్వాడ: మండలంలోని మందిపల్లిలో రైతు నర్సింహులు సాగు చేసిన వరి పంటను మంగళవారం కలెక్టర్ సిక్తా పట్నాయక్ పరిశీలించారు. నాలుగు ఎకరాల్లో వరి పంట సాగుచేయగా.. నీరు అందక ఎండిపోయే దశకు చేరుకుంది. గతేడాది పంట సాగుకు ఎలాంటి సమస్య రాలేదని, ఈ ఏడాది భూగర్భజలాలు అడుగంటిపోయి బోర్లు ఎండిపోయాయని, నీటి సమస్య తీవ్రమైందని రైతు పేర్కొన్నాడు. స్పందించిన కలెక్టర్ జిల్లాలో ఇలాంటి పరిస్థితి ఎక్కడెక్కడ ఉందో క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక ఇవ్వాలని డీఏఓ జాన్ సుధాకర్‌కు సూచించారు.

ఏకపక్ష నిర్ణయాలు సరికాదు



విధులు బహిష్కరించిన న్యాయవాదులు

నారాయణపేట: నారాయణపేట జిల్లా జడ్జి అబ్దుల్ రఫీ వైఖరిని నిరసిస్తూ మంగళవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించారు. జిల్లా జడ్జి రఫీ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుని క్రమశిక్షణ రహితంగా క్లైంట్లను, న్యాయవాదులను కించపరుస్తున్నారని అందుకు నిరసనగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్నామని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్ గౌడ్,అసోసియేషన్ సభ్యులు తెలిపారు. జిల్లా జడ్జి వ్యవహారంపై చర్యలు తీసుకోవాలని జిల్లా పోర్టు పోలియో జడ్జి మధుసూదన్‌కు,రాష్ట్ర బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి కి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది నాగురావునామాజీ,బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చెన్నారెడ్డి, ఉపాధ్యక్షుడు నందు నామాజీ, కార్యదర్శి బీంరెడ్డి, న్యాయవాదులు రఘువీర్ యాదవ్, సీతారామారావు పాల్గొన్నారు.

'ఇంటర్' వాల్యూయేషన్ ప్రారంభం



మహబూబ్‌నగర్ బాలుర జూనియర్ కళాశాలలో పరీక్ష రాసేందుకు వెళ్తున్న విద్యార్థులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్ పరీక్షల జవాబు పత్రాల వాల్యూయేషన్‌ను అధికారులు మంగళవారం ప్రారంభించారు. జిల్లాకేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాలలో వాల్యూయేషన్ క్యాంపును ఏర్పాటు చేశారు. ఇప్పటికే వివిధ జిల్లాల నుంచి 20 వేలకు పైగా సంస్కృతం సబ్జెక్టుకు సంబంధించిన జవాబుపత్రాలు క్యాంప్‌నకు చేరాయి. తెలుగు, ఇంగ్లిష్ సబ్జెక్టులకు సంబంధించిన జవాబుపత్రాలు ఒకట్రెండు రోజుల్లో రానున్నాయి. వీటికి అధికారులు కోడింగ్ ప్రక్రియ చేపట్టారు. మొత్తంగా అన్ని సబ్జెక్టులకు సంబంధించి రెండు లక్షలకు పైగా జవాబు పత్రాలు వచ్చే అవకాశం ఉంది. రెండు వారాల్లో వాల్యూయేషన్ పూర్తి చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఇంటర్ పరీక్షలకు 165 మంది గైర్హాజరు

నారాయణపేట ఎడ్యుకేషన్: జిల్లాలో మంగళవారం జరిగిన ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షకు 165 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 16 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా.. మొత్తం 4975 మంది విద్యార్థులకుగాను 4810 మంది హాజరయ్యారు. అందులో జనరల్ విద్యార్థులు 4,383 మందికిగాను 4239 మంది హాజరయ్యారు. 144 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌లో 592 మందికిగాను 571 మంది హాజరయ్యారు. 21మంది గైర్హాజరైనట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి సుదర్శన్‌రావు తెలిపారు.

ఉదండాపూర్ నిర్వాసితులకు మేలు జరిగేలా చర్యలు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్వాసిత కుటుంబాలకు అన్ని విధాల మేలు జరిగేలా చూస్తామని కలెక్టర్ విజయేందిర అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డితో కలిసి రెవెన్యూ, ఇరిగేషన్, సర్వే ల్యాండ్ రికార్డ్స్, సంబంధిత అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉదండాపూర్ రిజర్వాయర్ కింద వల్లూరు, ఉదండాపూర్, తుమ్మలకుంట తండా, రేగడిపట్టి తండా, చిన్నగుట్టతండా, శామగడ్డతండా, ఒంటి గుడిసె తండా, పోలేపల్లి వ్యవసాయక్షేత్రంలో ఇళ్లు కోల్పోయిన నిర్వాసిత కుటుంబాలకు అవార్డు అందుకున్న వారందరికీ పునరావాసం కింద మూడు వందల గజాల స్థలం, వారి అవసరాలకు ప్రైమరీ హెల్త్ సెంటర్, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, వెటర్నరీ హాస్పిటల్, కమ్యూనిటీ హాల్స్, పార్కులను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ వాటర్ పైపులైన్లు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలన్నారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులకు కొందరు అడ్డుపడుతున్నారని, భూమి కోల్పోయిన వారికి అపోహలు, భయాన్ని కలగజేస్తున్నారని, ఎవరూ ఆందోళన చెందవద్దని అన్నారు. ఉదండాపూర్ రిజర్వాయర్‌లో భూమి కోల్పోయిన వారికి ఎక్కువ మొత్తంలో నష్టపరిహారం అందేలా చూడాలని అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించినట్లు తెలిపారు. ఆర్‌అండ్‌ఆర్ విషయంలో ఏమైనా సమస్యలు ఉంటే ఆర్డీఓ దృష్టికి తీసుకురావాలన్నారు.



ముమ్మరంగా సహాయక చర్యలు

- ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్‌లోకి రోబోటిక్ సంస్థ ప్రతినిధులు
- కమ్యూనికేషన్ వ్యవస్థ ఏర్పాట్లు

- వివరాలు 8లో..

- అచ్చంపేట/ మన్ననూర్

పొలం కబ్జా చేశారు.. న్యాయం చేయండి

- తహసీల్దార్ కార్యాలయం ఎదుట కుటుంబంతో కలిసి మహిళా రైతు ధర్నా



బాలానగర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సులోచనదేవి కుటుంబం

రాజాపూర్(బాలానగర్): రెండెకరాల్లో ఒక ఎకరా పొలం రోడ్డులో పోగా.. మరో ఎకరా ప్రైవేటు వ్యక్తులు కబ్జా చేశారని.. తనకు న్యాయం చేయాలంటూ ఓ మహిళా రైతు కుటుంబంతో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగింది. బాలానగర్ మండలకేంద్రానికి చెందిన సులోచనదేవికి సర్వే నంబర్ 139/1, 139/2లో రెండెకరాల పట్టా పొలం ఉండేది. ఒక ఎకరా రోడ్డు విస్తరణలో పోగా మరో ఎకరా పొలం ప్రైవేటు వ్యక్తులు కబ్జా చేశారు. ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా తమకు న్యాయం జరగకపోవడంతో ఆమె తన కుమారులతో కలిసి మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ధర్నా దిగింది. జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి అల్వాల్‌రెడ్డి మద్దతు తెలిపారు. రైతు కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు. అవసరమైతే హైదరాబాద్‌లో నిరాహార దీక్ష చేపడతామని పేర్కొన్నారు.

క్లుప్తంగా

అనుమానాస్పదంగా వృద్ధురాలి మృతి


చిన్నమ్మ(ఫైల్)

గద్వాల క్రైం: అనుమానాస్పదంగా వృద్ధురాలు మృతి చెందిన ఘటన గద్వాలలో చోటుచేసుకున్నట్లు పట్టణ ఎస్‌ఐ కల్యాణ్‌కుమార్ తెలిపారు. వివరాలు.. మోమిన్ మహోల్ల కాలనీకి చెందిన చిన్నమ్మ(85) కొన్ని రోజుల క్రితం కిందపడి తీవ్ర అనారోగ్యానికి గురైంది. కుటుంబ సభ్యులు ఉన్నా ఆమె బాగోగులను పట్టించుకునే వారు కాదు. రాఘవేంద్ర కాలనీలోని అనాథశ్రమంలో ఉండేది. వారం రోజుల క్రితం వృద్ధురాలిని కుమారులు జలదుర్గం రమేష్, రాజు మోమిన్ మహోల్లలోని స్వంత ఇంట్లో(పాడుబడ్డ)కి తీసుకొచ్చారు. ఆమెకు వంతుల వారీగా ఆహారం అందించేవారు. అయితే సోమవారం రాత్రి కుటుంబ సభ్యులు వృద్ధురాలికి ఆహారం అందించి చీకటి గది కావడంతో వెలుతురు కోసం కొవ్వొత్తిని వెలిగించి మంచం సమీపంలో పెట్టి వెళ్లారు. ఆమె నిద్రించే క్రమంలో కొవ్వొత్తికి దుప్పటి తగిలి మంటలు వ్యాపించి ఉండొచ్చని అనుమానం వ్యక్తమవుతోంది. అయితే స్థానికులు మాత్రం ఆమెను కుటుంబ సభ్యులే హత్య చేసి ఉంటారని ఆరోపిస్తున్నారు. ఘటనాస్థలికి గద్వాల సీఐ శ్రీను చేరుకొని పరిశీలించారు. కేసు విచారణలో నిజనిజాలు నిర్ధారణ అవుతాయని ఆయన వెల్లడించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుమారుడు రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైలు నుంచి పడి వ్యక్తి..

ఆత్మకూర్: ప్రమాదవశాత్తు రైలులో నుంచి జారిపడి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మంగళవారం వెలుగు చూసింది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ అశోక్ కథనం మేరకు.. సోమవారం అర్ధరాత్రి మండల పరిధిలోని శ్రీరాంనగర్ రైల్వేస్టేషన్ – గద్వాల రైల్వేస్టేషన్ మధ్య 184వ కిలోమీటరు వద్ద పట్టాలపై 45 ఏళ్ల వయసున్న గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు సమాచారం అందింది. మంగళవారం ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు వివరించారు. మరిన్ని వివరాలకు సెల్‌నంబర్లు 87126 58608, 83412 52529 సంప్రదించాలని సూచించారు.

బావిలో పడి..

శాంతినగర్: ప్రమాదవశాత్తు బావిలో పడి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్ జములమ్మ ఆలయ సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. బంధువులు జములమ్మ దేవర చేస్తున్నారని కలుకుంట్లకు చెందిన మద్దిలేటి (36) ఆలయానికి వచ్చి వెనక ఉన్న బావిలో ప్రమాదవశాత్తు పడిపోయాడు. బంధువుల ఫిర్యాదు మేరకు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు శాంతినగర్ పోలీసులు వివరించారు.

లారీ బోల్తా.. తప్పిన ప్రమాదం

తాడూరు: మండల కేంద్రానికి సమీపంలోని మల్కాపూర్ గేట్ కాజ్వే బ్రిడ్జి వద్ద మంగళవారం సాయంత్రం కోళ్ల ఎరువుతో వెళ్తున్న లారీ ప్రమాదవశాత్తు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎలాంటి నష్టం వాటిల్లలేదు. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

మామిడితోట దగ్ధం



రాజాపూర్: మండలంలోని రాయపల్లికి చెందిన మహిళా రైతు మాధవి మామిడితోట సోమవారం రాత్రి అగ్నికి ఆహుతైంది. గ్రామస్తుల కథనం మేరకు.. పోలేపల్లి శివారులోని పరిశ్రమల నుంచి వెలువడే పొగతో పాటు నిప్పు రవ్వలు వచ్చి రైతు పొలంలో పడి ఎండిన గడ్డి అంటుకొని మంటలు వ్యాపించి మామిడి తోట కాలిపోయిందన్నారు. రైతులను నష్టపరుస్తున్న పరిశ్రమలపై అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జడ్చర్లలో పశుగ్రాసం..



జడ్చర్ల: పట్టణంలోని శ్రీనివాసనగర్‌లో కౌలు రైతు సంజీవ్ నిల్వ చేసిన పశుగ్రాసం ప్రమాదవశాత్తు నిప్పంటుకొని కాలి బూడిదైంది. వరి గడ్డివాము నుంచి మంగళవారం ఒక్కసారిగా పొగలు రావడంతో రైతు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేసి పొక్లెయిన్‌తో చెల్లాచెదురు చేసినా ఫలితం లేకపోయింది. సుమారు రూ.2 లక్షల నష్టం వాటిల్లిందని.. ప్రభుత్వ పరంగా సాయం అందించి ఆదుకోవాలని బాధితుడు విజ్ఞప్తి చేశారు.

గళం విప్పుతాం.. నిధులు రాబడతాం

అసెంబ్లీ సమావేశాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో నెలకొన్న దీర్ఘకాల సమస్యలు, ప్రాజెక్టుల నిర్మాణాలు, సాగునీటి సరఫరా, నిర్వాసితుల నష్టపరిహారం, రోడ్ల విస్తరణ, విద్యాసంస్థలు, పరిశ్రమల ఏర్పాటు, ఉపాధి కల్పన తదితర వాటిపై తమ గళం వినిపించి పరిష్కారానికి కృషిచేస్తామని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ఎమ్మెల్యేలు అభిప్రాయపడ్డారు. అయితే ప్రస్తుతం నిర్వహించేది బడ్జెట్ సమావేశాలు కావడంతో అధికంగా నిధులు మంజూరుకు కృషిచేస్తామని పేర్కొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



నిధుల కేటాయింపు..



అసెంబ్లీ సమావేశాల్లో విద్య, వైద్యం, ఉపాధి కల్పనపై ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తా. నూతనంగా ఏర్పడిన మహబూబ్‌నగర్ కార్పొరేషన్‌కు ప్రత్యేక నిధుల కేటాయింపు, ఏదైనా ఉన్నత విద్యా సంస్థ మంజూరు, విద్యాలయాల్లో మౌలిక వసతుల కల్పన, జిల్లాలో పరిశ్రమలు, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ల ఏర్పాటు, ప్రతి గ్రామానికి రోడ్డు సౌకర్యం, పెద్ద గ్రామాల్లో హెల్త్‌సెంటర్ల ఏర్పాటు గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాను.

– యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే, మహబూబ్‌నగర్

విద్య, వ్యవసాయంపైనే..



బడ్జెట్ సమావేశాల్లో నాగర్‌కర్నూల్ నియోజకవర్గానికి సంబంధించి విద్య, వ్యవసాయ రంగాల్లో ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా. పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతలకు సంబంధించి డిస్ట్రిబ్యూటరీలు పూర్తి చేసేలా నిధులు మంజూరు చేయాలని కోరుతా. ప్రభుత్వ జూనియర్ కళాశాల సొంత భవన నిర్మాణానికి రూ.9 కోట్లతో ప్రతిపాదనలు పంపించాం. త్వరలో నిధులు కూడా మంజూరు కానున్నాయి.

– కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి, ఎమ్మెల్యే, నాగర్‌కర్నూల్

పరిశ్రమల ఏర్పాటు కోసం



పేట నియోజకవర్గంలో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పరిశ్రమలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. పరిశ్రమల ఏర్పాటుతో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించవచ్చు. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవన నిర్మాణం, నియోజకవర్గంలో ప్రైవేట్ అద్దె భవనాల్లో కొనసాగుతున్న డిగ్రీ, జూనియర్ ప్రభుత్వ కళాశాలలకు సొంత భవనాలకు నిధులు కావాలని, ప్రతి ఎకరాకు సాగునీరు అందేలా ప్రాజెక్టుల రూపకల్పన చేయాలని కోరుతాను.

– చిట్టెం పర్ణికారెడ్డి, ఎమ్మెల్యే, నారాయణపేట

ముంపు గ్రామాలపై..



మక్తల్ నియోజవర్గంలో ఏళ్ల తరబడిగా ముంపు గ్రామాల ప్రజల సమస్యలు తీరడం లేదు. ఈ సమస్యలను తీర్చాలని అసెంబ్లీలో చర్చిస్తా. జూరాల బ్యాక్ వాటర్‌లో ముంపునకు గురైన అనుగొండ, గడ్డంపల్లి, దాదాన్‌పల్లి, అంకేన్‌పల్లి గ్రామాలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. సంగంబండ, భూత్పూర్ రిజర్వాయర్ కింద ముంపునకు గురైన ఉజ్జెల్లి, గార్లపల్లి, నేరడుగం, భూత్పూర్‌లో ఊట నీటితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అసెంబ్లీలో చర్చించి శాశ్వత పరిష్కారానికి కృషిచేస్తా.

– వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే, మక్తల్

సాగునీరు, పర్యాటక రంగం..



అచ్చంపేట నియోజకవర్గానికి సాగునీరు తేవడంపైనే ప్రధానంగా అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావిస్తా. ఉన్నత విద్యపై దృష్టిపెడతాం. ఈ ప్రాంతంలో 3.50 టీఎంసీల సామర్థ్యంతో ప్రాజెక్టుల నిర్మాణం, ఇప్పటికే మంజూరైన ఉమామహేశ్వర/అమ్రాబాద్ లిఫ్టుల ఏర్పాటు త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతాను. సీఎం సహకారంతో నల్లమల ప్రాంతాన్ని మరో కోనసీమగా మార్చడమే నా లక్ష్యం. నల్లమలలోని వనరుల ద్వారా ఉపాధి అవకాశాలు, పరిశ్రమలు, పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై గళం వినిపిస్తాను.

– వంశీకృష్ణ, ఎమ్మెల్యే, అచ్చంపేట

ప్రధాన సమస్యలపై దృష్టి



అలంపూర్ రైతులు ప్రధానంగా సాగు నీటిని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తుమ్మిళ్ల ఎత్తిపోతల ద్వారా పూర్తిస్థాయిలో సాగునీరు అందించడానికి మల్లమ్మకుంట రిజర్వాయర్ నిర్మాణ పనులు పూర్తి చేయాలి. అలాగే వంద పడకల ఆస్పత్రిని నిర్మించి ప్రారంభించినా.. ప్రస్తుతం వైద్య సేవలు అందించడం లేదు. దీంతో వైద్యం కోసం ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాను. అలాగే అసంపూర్తిగా ఉన్న రోడ్ల పనులు పూర్తి చేయాలని, అధ్వానంగా ఉన్న రోడ్ల ఆధునీకరణ అంశాలను అసెంబ్లీలో ప్రస్తావిస్తాను.

– విజయుడు, ఎమ్మెల్యే, అలంపూర్

సాగునీరు, విద్య, వైద్యం



గద్వాల నియోజకవర్గంలో సాగునీటి ప్రాజెక్టు గుడ్డెందొడ్డి జలాశయం సామర్థ్యం పెంపు, ర్యాలంపాడు మరమ్మతులతోపాటు జలాశయం పెంపుపై కూడా ప్రధానంగా ప్రస్తావిస్తాను. అదేవిధంగా మెడికల్ కాలేజీలో స్టాఫ్ నియామకం, జిల్లా ఆస్పత్రిని 500 బెడ్లకు పెంచాలని కోరుతాను. ఇదివరకే దీనిపై పలుమార్లు సీఎం, సంబంధిత మంత్రులు, రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులకు వ్యక్తిగతంగా లేఖలు రాశాను. అసెంబ్లీ సమావేశాల్లో వీటిపైనే మరోసారి ప్రస్తావించి ప్రభుత్వ సాయంతో వీటిని సాధించేలా కృషి చేస్తాను.

– బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే, గద్వాల

గొల్లపల్లి రిజర్వాయర్ ప్రతిపాదనలపై..



నియోజకవర్గంలో మరో పదివేల ఎకరాలకు సాగునీరందించేందుకు రేవల్లి మండలం గొల్లపల్లి వద్ద నూతనంగా మినీ రిజర్వాయర్ నిర్మాణం కోసం ప్రతిపాదనను ప్రభుత్వానికి అందజేశాం. ఈ అంశంపై అసెంబ్లీలో ప్రస్తావిస్తా. ఇప్పటికే కేఎల్‌ఐ, భీమా, జూరాల సాగునీటి కాల్వలతో చాలా మేరకు సాగునీరు అందుతుంది. ప్రభుత్వం, ఫారెస్ట్ అధికారుల నుంచి అనుమతులు లభిస్తే గొల్లపల్లి రిజర్వాయర్ పనులు వేగంగా పూర్తి చేస్తాం. రింగ్ రోడ్డు, సాగునీటి కాల్వల పనులు పెండింగ్‌లో ఉన్నాయి. దరఖాస్తు చేసుకున్న 2,713 మంది రైతులకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని విన్నవిస్తాం.

– తూడి మేఘారెడ్డి, ఎమ్మెల్యే, వనపర్తి

నిర్వాసితుల సమస్యల ప్రస్తావన



జడ్చర్ల నియోజకవర్గంలోని ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి సంబంధించిన అంశాలను అసెంబ్లీలో ప్రస్తావిస్తాను. రూ.25 లక్షల వరకు ఆర్‌అండ్‌ఆర్ పెంపుదల చేయాలని డిమాండ్ చేస్తాను. అదేవిధంగా త్వరితగతిన ముంపు గ్రామాలకు అవార్డ్ పాస్ చేసి రిజర్వాయర్ పనులను పూర్తి చేయాలని కోరుతాను. నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని విన్నవిస్తాను.

– అనిరుధ్‌రెడ్డి, ఎమ్మెల్యే, జడ్చర్ల

'కల్వకుర్తి'ని పూర్తి చేయడమే ధ్యేయం



నియోజకవర్గ రైతులకు వరప్రదాయిని కల్వకుర్తి ఎత్తిపోతల పథకం. ఈ ప్రాజెక్టు ద్వారా చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలని, డిస్ట్రిబ్యూటరీ కాల్వలు పూర్తి చేయాలని శాసనసభలో ప్రభుత్వాన్ని కోరుతాను. దీంతోపాటు విద్య, వైద్యం కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరు చేయించడంతోపాటు.. మంజూరైన పనులకు టెండర్లు వేయాలని ప్రభుత్వాన్ని కోరుతా. అలాగే ఇప్పటికే మంజూరైన రోడ్ల నిర్మాణం వెంటనే చేపట్టాలని సభ దృష్టికి తీసుకెళ్తాను.

– కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎమ్మెల్యే, కల్వకుర్తి

ముమ్మరంగా సహాయక చర్యలు


రెస్క్యూ బృందాలకు సూచనలు చేస్తున్న అరవింద్‌కుమార్, కలెక్టర్ బదావత్ సంతోష్

- ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్‌లోకి రోబోటిక్ సంస్థ ప్రతినిధులు
- కమ్యూనికేషన్ వ్యవస్థ ఏర్పాట్లు

అచ్చంపేట/మన్ననూర్: ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్‌లో జరుగుతున్న సహాయక చర్యలకు రోబోలను ఉపయోగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన మేరకు మంగళవారం ఉదయం హైదరాబాద్‌కు చెందిన అన్వి రోబోటిక్స్ సంస్థకు చెందిన ఏఐ బేస్డ్ కెమెరా సదుపాయం గల రోబోటిక్‌లను తీసుకెళ్లారు. సంస్థ ప్రతినిధులు విజయ్, అక్షయ్ లోకో ట్రైన్‌లో సొరంగంలోకి వాటిని తీసుకెళ్లారు. అన్వి రోబోటిక్ సంస్థకు చెందిన ప్రతినిధులు టన్నెల్ దగ్గర ఆఫీసులో కమ్యూనికేషన్ వ్యవస్థ ఏర్పాట్లను ప్రారంభించారు. ప్రమాద ప్రదేశంలో చేపట్టే సహాయక చర్యల్లో ఎలాంటి ప్రాణనష్టం సంభవించకుండా రోబోలను ఉపయోగించుకుంటున్నట్లు డిజాస్టర్ మేనేజ్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్‌కుమార్ తెలిపారు. సహాయక చర్యల్లో కావాల్సిన సామగ్రితోపాటు సహాయక బృందాలు మరోమారు కాడవర్ డాగ్స్ ప్రమాద ప్రదేశానికి వెళ్లాయని తెలిపారు. సమావేశంలో ప్రస్తుత సహాయక చర్యల పురోగతిని సమీక్షించి, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. టన్నెల్ సహాయక చర్యలలో అనుసరించాల్సిన విధివిధానాలు, రోబోటిక్స్, మెకానికల్ పరికరాల వినియోగం, మట్టి తొలగింపు ప్రక్రియ, భద్రతా చర్యలపై విస్తృతంగా చర్చించిన అధికారులు సహాయక చర్యలను మరింత వేగవంతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. సమావేశంలో కలెక్టర్ బదావత్ సంతోష్, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా అన్వి రోబోటిక్స్, హైడ్రా, ఆర్మీ, ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్డీఆర్‌ఎఫ్, సింగరేణి, ర్యాట్ మైనర్స్, దక్షిణ మధ్య రైల్వే తదితరులు పాల్గొన్నారు.


టన్నెల్‌లోకి వెళ్తున్న కాడవర్ డాగ్ స్క్వాడ్స్

గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో..

ఎస్‌ఎల్‌బీసీ సొరంగం ప్రమాద సంఘటనలో కార్మికులను కాపాడటం కోసం చేస్తున్న సహాయక చర్యల్లో పాల్గొంటున్న వారికి భోజన ఏర్పాట్లు గిరిజన సంక్షేమ శాఖ చేపడుతోంది. కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదేశాల మేరకు డీటీడీఓ ఫిరంగి పర్యవేక్షణలో 18 రోజులుగా సహాయక చర్యల్లో పాల్గొంటున్న రెస్క్యూ బృందాలతోపాటు అక్కడ పనిచేస్తున్న వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, పోలీసులతోపాటు మీడియాకు మూడు పూటలా భోజన ఏర్పాట్లు చేస్తుంది.

రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు
- నేడు పార్వతి సమేత రామలింగేశ్వరుడి కల్యాణ మహోత్సవం

అడ్డాకుల: మండలంలోని కందూర్ శివారులో స్వయంభూగా వెలిసి దక్షిణకాశీగా పేరొందిన శ్రీరామలింగేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు గోపూజతో మంగళవారం రాత్రి ప్రారంభమయ్యాయి. ఆలయంలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన యాగశాలలో భూతబలి కార్యక్రమం నిర్వహించి యాగశాల ప్రవేశం చేశారు. విఘ్నేశ్వర పూజ, అగ్నిప్రతిష్ఠ, అంకురారోహణ, ధ్వజారోహణం, బలిహరణ కార్యక్రమాలను పండితులు ఘనంగా నిర్వహించారు. ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి ధ్వజ స్థాపన చేసి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఆలయ ఆవరణలో స్వామి వారి ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం ఉదయం ఆలయంలో పార్వతి సమేత రామలింగేశ్వరస్వామి కల్యాణాన్ని నిర్వహించనున్నారు. ఇందుకోసం ఆలయం వద్ద అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. కల్యాణానికి తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయంలో చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. ఈఓ రాజేశ్వరశర్మ, జూనియర్ అసిస్టెంట్ అనంతసేన్‌రావు, ఆలయ నిర్వాహకులు రవీందర్‌శర్మ, కారెడ్డి నాగిరెడ్డి, తోట శ్రీహరి, దామోదర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, విజయలక్ష్మి, కారెడ్డి లత, దేవన్న యాదవ్, ఆలయ పూజారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


గో పూజతో ఉత్సవాలను ప్రారంభిస్తున్న పండితులు


ధ్వజారోహణ చేసి పూజలు చేస్తున్న పండితులు

నాగుపాముకు చికిత్స

జడ్చర్ల టౌన్: మండలంలోని ఆల్వాన్‌పల్లిలో పట్టుకునే క్రమంలో గాయపడిన నాగుపాముకు సర్పరక్షకుడు డా.సదాశివయ్య చికిత్స అందించి కాపాడారు. వివరాలు.. ఆల్వాన్‌పల్లిలో నాగుపామును గుర్తించిన యువకులు సర్పరక్షకుడు డా. సదాశివయ్యకు ఫోన్‌ద్వారా సమాచారం అందించారు. దీంతో ఆయన తన శిష్యులైన రాహుల్, రవీందర్ అక్కడికి చేరుకునేలోపు నాగుపాము సమీపంలోని రంధ్రంలోకి వెళ్లింది. దాన్ని తవ్వి పామును బయటకు తీసేందుకు యువకులు గడ్డపారతో తవ్వుతుండగా పాము నడుములో దిగబడింది. అది ఒక్కసారిగా బుసలు కొడుతూ బయటికొచ్చింది. అదిగమనించిన యువకులు అక్కడి నుంచి పరారయ్యారు. అక్కడికి చేరుకున్న రాహుల్, రవీందర్ చాకచక్యంగా పామును పట్టుకొని జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల జీవ వైవిధ్య సంరక్షణ కేంద్రానికి తీసుకొచ్చారు. అక్కడ డా.సదాశివయ్య పాముకు చికిత్స అందించి కట్టువేసి కాపాడారు. ప్రస్తుతం గాయపడిన పాము ఇదే కేంద్రంలో ఉంచారు.


పాముకు చికిత్స చేస్తున్న సదాశివయ్య

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

కోస్గి: స్కానింగ్ కేంద్రాల్లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర వైద్యశాఖ అధికారి డా. జయంతిరెడ్డి హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని పలు స్కానింగ్ కేంద్రాలను జిల్లా వైద్యాధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. స్కానింగ్ చేసే వారి వివరాలు విధిగా సమగ్రంగా నమోదు చేయాలని, ఆధార్ కార్డు, పూర్తి చిరునామా, స్కానింగ్ తీయడానికి గల కారణాలు ఉండాలని సూచించారు. రేడియాలజిస్టులే స్కానింగ్ తీయాలన్నారు. ఆమె వెంట జిల్లా ఉప వైద్యాధికారి డా. శైలజ తదితరులు ఉన్నారు.


స్కానింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న రాష్ట్ర వైద్యశాఖ అధికారి డా. జయంతిరెడ్డి

దాడి కేసులో నిందితులకు జైలుశిక్ష

జడ్చర్ల: మండలంలోని కిష్టారం గ్రామంలో దాయాదులు ఓ కుటుంబంపై దాడి చేసిన కేసులో తొమ్మిది మంది నిందితులకు మూడు నెలలు జైలుశిక్షతో పాటు ఒక్కో నిందితుడికి రూ.500 జరిమానా విధిస్తూ మంగళవారం మహబూబ్‌నగర్ కోర్టు జడ్జి ముద్దసిర్‌మహ్మద్ తీర్పు ఇచ్చినట్లు కోర్టు కానిస్టేబుల్ యాసిన్ తెలిపారు. అక్టోబర్ 12, 2017లో తమ కుటుంబ సభ్యులపై దాయాదులు పొన్నకంటి వెంకటయ్య, మౌనిందర్, సురేందర్, హరేందర్, లక్ష్మయ్య, మానస, లక్ష్మమ్మ,సరోజ, రాజులు దాడి చేసి గాయపరిచారని బాధితుడు పొన్నకంటి రాములు జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. విచారించిన జడ్జి నిందితులకు శిక్షను విధిస్తూ తీర్పు వెల్లడించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నవాబుపేట: బైక్ అదుపు తప్పి కింద పడి తీవ్ర గాయాలపాలైన వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు. గత నెల 27న పత్తేపూర్‌కి చెందిన కమ్మరి శ్రీనివాస్‌చారి(40) అనే వ్యక్తి బైక్‌పై జిల్లా కేంద్రానికి వెళ్లాడు. పని ముగించుకొని తిరిగి ఇంటికి వస్తుండగా కాకర్లపహాడ్ సమీపంలో బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్ర గాయాలు కావటంతో స్థానికులు 108 వాహనంలో జిల్లా ఆస్పత్రిలో చేర్పించి కుటుంబీకులకు సమాచారం అందించారు. వారు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి సోదరుడు కమ్మరి రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కొప్పునూరులో మరొకరు..


నరసింహా రెడ్డి(ఫైల్)

చిన్నంబావి: పురుగుమందు తాగి చికిత్స పొందుతూ కోలుకోలేక ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని కొప్పునూరులో చోటుచేసుకున్నట్లు ఎస్‌ఐ జగన్‌మోహన్ తెలిపారు. వివరాలు.. కొప్పునూరుకి చెందిన బంకుమిది నరసింహారెడ్డి (56) అనారోగ్య సమస్యలతో సోమవారం పురుగుమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కొల్లాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నాగర్ కర్నూలు జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి భార్య అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్‌పై నుంచి కిందపడి..


ఆనందం(ఫైల్)

చిన్నచింతకుంట: మోటార్ సైకిల్ అదుపు తప్పి కిందపడి గాయాలపాలై చికిత్స పొందుతూ ఓ వ్యక్తి చెందినట్లు ఎస్‌ఐ రామ్‌లాల్‌నాయక్ తెలిపారు. వివరాలు.. మండలంలోని లక్ష్మీదేవ్‌పూర్‌కి చెందిన పల్లె పాగు ఆనందం(50) ఈ నెల 7న తన బైక్‌పై చిన్న చింతకుంటకు వచ్చాడు. కూరగాయలు తీసుకొని గ్రామానికి తిరుగు ప్రయాణం అయ్యాడు. మార్గమధ్యలో బైక్ అదుపు తప్పి కిందపడగా ఆనందంకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం మహబూబ్‌నగర్ ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం మృతి చెందాడు. మృతుడి తమ్ముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.